VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ గురువారం 01 మే 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 278

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపు

విబజన చట్టం ప్రకారం పెంచాలన్న పిటిషనర్

విచారణ చేసి తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు

# తెలంగాణ ఇస్తే పదేళ్లు దోపిడీ చేశావ్

. "వంద ఎలుకల్ని తిన్న పిల్లి తీర్థయాత్రకు వెళ్లినట్లు.. కేసీఆర్ వరంగల్ వెళ్లారు. అక్కడికి వెళ్లి పాపాలు కడిగేసుకున్నానని అనుకుంటున్నారు.

### మళ్లీ మమ్ములనే విలన్ అంటావా

### ఏం చేస్తున్నామో....చేస్తలేమో సభకు వస్తే కదా తెలిసేది

### కెసిఆర్ విమర్శలను తిప్పికొట్టిన సిఎం రేవంత్

పదేళ్లూ అధికారంలో మేమే ఉంటాం..'తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా? మరో పదేళ్లు దోచుకోవడం ఆగిపోయిందన్న అక్కసుతో తెలంగాణ ఆగమైందని అంటారా?' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్‌కు కాంగ్రెస్‌ను విమర్శించే హక్కులేదన్నారు.



2లో..



2లో..

## డిగ్రీలు వస్తున్నా... స్కిల్స్ ఉండడం లేదు

అందుకే స్కిల్ వర్సిటీ

ఏర్పాటు చేస్తున్నాం

న్యాక్ కార్యక్రమలో మంత్రి కోమటిరెడ్డి

# రూ.90 వేల కోట్ల

## ప్రాజెక్టుల్ని సమీక్షించిన మోదీ



ప్రధానమంత్రి నరేంద్రమోదీ 46వ ప్రగతి (ప్రాయాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్‌లీ ఇంప్లిమెంటేషన్) సమావేశంలో పాల్గొని దేశంలోని వివిధ ప్రాంతాల్లో రూ 90 వేల కోట్లతో చేపట్టిన 8 పథకాల అమలును సమీక్షించారు.


దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ 46వ ప్రగతి (ప్రాయాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్‌లీ ఇంప్లిమెంటేషన్) సమావేశంలో పాల్గొని దేశంలోని వివిధ ప్రాంతాల్లో రూ 90 వేల కోట్లతో చేపట్టిన 8 పథకాల అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం అమలులో తలెత్తిన ఫిర్యాదుల పరిష్కారాన్నీ పరిశీలించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల్ని గుర్తించడానికి బయోమెట్రిక్ ఆధారిత ఆధార్ నిర్ధారణ, పరిశీలన పద్ధతుల్ని తు.చ. తప్పకుండా పాటించాలని ఆయన ఆదేశించినట్టు ఒక అధికారిక ప్రకటన వెల్లడించింది. ప్రగతి అనేది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల సకాల అమలును పరిశీలించే బహుముఖ వేదిక. ప్రధానమంత్రి సమీక్షించిన కార్యక్రమాల్లో మూడు రోడ్డు ప్రాజెక్టులు, రెండు రైల్వే, రెండు రేవుల ప్రాజెక్టులు, ఒక షిప్పింగ్ జల రవాణా కార్యక్రమం ఉన్నాయి. బాలల సంరక్షణ, వారి ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత పెంపొందించేందుకు సంబంధించిన కార్యక్రమాలను పీఎం మాతృవందన యోజన కార్యక్రమంతో అనుసంధానించాలని ఆయన కోరారు. ఒక రింగు రోడ్డు అభివృద్ధి కార్యక్రమాన్ని సమీక్షిస్తూ రింగురోడ్ల అభివృద్ధిని విస్తృత పట్టణాభివృద్ధి ప్రయత్నాల్లో భాగం చేయాలని ఆయన కోరారు. రానున్న 25 నుంచి 30 ఏళ్ల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి కార్యకలాపాలను సమగ్రంగా రూపొందించుకోవాలని ఆయన అన్నారు. జలమార్గ్ వికాస్ ప్రాజెక్టును సమీక్షిస్తూ ఈ కార్యక్రమం కింద క్రూయిజ్ (పడవ ప్రయాణ) పర్యాటకానికి ఊతం అందించేలా ప్రయత్నాలు జరగాలన్నారు.

## కులగణన సర్వే చారిత్రక నిర్ణయం

కాంగ్రెస్ ఏనాడూ నిర్వహించలేక పోయింది

మోడీ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు

కేంద్రమంత్రి బండి సంజయ్



2లో..



2లో..

సిఎస్‌గా రామకృష్ణారావు బాధ్యతలు స్వీకరణ

అభినందనలు తెలిపిన మాజీ సిఎస్ శాంతికుమారి

## గ్రూప్-1పై సింగిల్ బెంచ్ విచారణ

మార్కులు, హాల్ టిక్కెట్ వివరాలు ఇవ్వాలని ఆదేశం

విచారణ నేటికి వాయిదా

2లో..



# జనాభా లెక్కలతోనే కులగణన





జనాభా లెక్కలతోనే కులగణన

కేంద్రకేబినేట్ కీలక నిర్ణయం

సరిహద్దు ఉద్రిక్తతలో పాటు పలు అంశాలపై చర్చ

వివరాలు వెల్లడించిన మంత్రి అశ్వినీ వైష్ణవ్

పలు రాష్ట్రాల్లో సర్వే అస్పష్టతగా ఉందని వ్యాఖ్య

న్యూఢిల్లీ: దేశంలో కులగణనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టాలని నిర్ణయించింది. జనాభా లెక్కల్లోనే కులగణను చేర్చుతామని కేంద్రం ప్రకటించింది. కులగణన పేరుతో కాంగ్రెస్ సర్వే చేయించిందని, ఆయా రాష్ట్రాల్లో చేపడుతున్న సర్వేల్లో పారదర్శకత లేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. నేడు కేంద్ర కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన వివరాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.
రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీనిసూపర్ కేబినెట్‌గా వ్యవహరిస్తారు. బుధవారం జరిగిన భేటీలో కులగణనకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. కులగణన అంశం కేంద్రం పరిధిలోకి వస్తున్నప్పటికీ.. కొన్ని రాష్ట్రాలు మాత్రం సర్వేల పేరుతో వాటిని నిర్వహించాయన్నారు. ముఖ్యంగా విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రాజకీయ కారణాల వల్ల వాటిని చేపట్టారని విమర్శించారు. ఇందులో పారదర్శకత లేదన్నారు. కేవలం రాజకీయకారణాలతో చేసినందున స్పష్టత లేదన్నారు. అందుకే తదుపరి దేశవ్యాప్తంగా చేపట్టే జనాభా లెక్కల ప్రక్రియలో కులగణనను చేర్చి పారదర్శకంగా చేపట్టాలన్నదే మోదీ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. దేశ రక్షణకు సంబంధించి ముఖ్యంగా దృష్టిపెట్టిన కేంద్ర మంత్రివర్గం ఈ అంశంతో పాటు, దేశ వ్యాప్తంగా, వివిధ రాష్ట్రాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి కూడా నిర్ణయాలు తీసుకుంది. ఈ నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. జనాభా లెక్కల్లో భాగంగా కులగణన కూడా చేస్తామని కేంద్రం పేర్కొంది. పారదర్శకంగా కులగణన జరగాలని కేంద్రం భావిస్తోంది. ఇందు కోసం సర్వేలపై ఆధారపడకుండా జనాభాలెక్కలలోనే ఈ విషయం నిర్ధారణ చేసుకుంటే సామాజిక సమతుల్యతకు ఆస్కారం లభిస్తుందని కేంద్రం నిర్ణయానికి వచ్చింది. వివిధ రాష్ట్రాల్లోని కాంగ్రెస్ సర్కార్లు తీసుకొచ్చే సర్వేలు చాలా లోపభూయిష్టంగా ఉన్నాయని, దీని వల్ల సమాజ శ్రేయస్సు దెబ్బతినే అవకాశం ఉందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. అందుకే తదుపరి జనాభా లెక్కల్లో కుల సర్వేను కూడా చేర్చాలని కేబినెట్ తీసుకున్న నిర్ణయం చారిత్రకమని అశ్విని వైష్ణవ్ అన్నారు. ఏప్రిల్ 2020లోనే జనాభా లెక్కలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ.. కొవిడ్ కారణంగా వాయిదా పడిన విషయం తెలిసింది. భారత్-పాకిస్థాన్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ.. గత రెండు రోజులుగా దిల్లీలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ప్రధాని మోదీ నేతృత్వంలో రక్షణమంత్రి, జాతీయ భద్రతా సలహాదారు, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, త్రివిధ దళాధిపతులతో సమావేశం జరిగింది. ఇదే క్రమంలో బుధవారం భద్రతపై కేబినెట్ కమిటీ, అనంతరం రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీ జరిగింది.

## పదిలో రికార్డుస్థాయి ఉత్తీర్ణత

# 92.78 % పాస్

పదో తరగతి పరీక్షల్లో ఈసారి రికార్డు స్థాయిలో 92.78 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కరోనా రెండేళ్ల కాలాన్ని మినహాయిస్తే ఇప్పటివరకు రాష్ట్రంలో ఇదే అత్యధిక ఉత్తీర్ణత శాతం. మొత్తం 4,96,374 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాయగా 4,60,519 మంది పాసయ్యారు. గత ఏడాది కన్నా ఈసారి 1.47 శాతం ఉత్తీర్ణత పెరిగింది.

కరోనా రెండేళ్లు మినహాయిస్తే రాష్ట్రంలో ఇదే అత్యధికం

బాలికలదే పైచేయి

మహబూబాబాద్ జిల్లాకు ప్రథమ స్థానం.. అట్టడుగున వికారాబాద్

ఫలితాలు విడుదల చేసిన సీఎం

జూన్ 3 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు




హైదరాబాద్: పదో తరగతి పరీక్షల్లో ఈసారి రికార్డు స్థాయిలో 92.78 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కరోనా రెండేళ్ల కాలాన్ని మినహాయిస్తే ఇప్పటివరకు రాష్ట్రంలో ఇదే అత్యధిక ఉత్తీర్ణత శాతం. మొత్తం 4,96,374 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాయగా 4,60,519 మంది పాసయ్యారు. గత ఏడాది కన్నా ఈసారి 1.47 శాతం ఉత్తీర్ణత పెరిగింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఫలితాలను విడుదల చేశారు. బాలుర ఉత్తీర్ణత 91.32 శాతం కాగా.. అమ్మాయిలు 94.26 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. మహబూబాబాద్ జిల్లా 99.29 శాతంతో ప్రథమ స్థానంలో నిలవగా.. ఆ తర్వాత సంగారెడ్డి(99.09%), జనగామ 98.81 శాతంతో రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. వికారాబాద్ జిల్లా 73.97 శాతంతో అట్టడుగున నిలిచింది. రాష్ట్రంలోని 11,554 పాఠశాలల నుంచి విద్యార్థులు పరీక్షలు రాయగా.. అందులో 4,629 బడుల్లో 100 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. అంటే 40 శాతం పాఠశాలల్లో పరీక్ష రాసిన వారందరూ పాసయ్యారు. రెండు ప్రైవేటు పాఠశాలల్లో ఒక్క విద్యార్థీ ఉత్తీర్ణులు కాకపోవడం గమనార్హం.

వేగుచుక్క

# కులగణన సర్వే చారిత్రక నిర్ణయం



హైదరాబాద్: దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతోపాటు- కుల గణన నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సాహసోపేత నిర్ణయం తీసుకున్న ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా ప్రజలకు ఎంతో ప్రయోజనం కలగబోతోందని, అత్యంత శాస్త్రీయంగా కేంద్రం నిర్వహించే ఈ సర్వేలో కులాల వారీగా ఎంత జనాభా ఉందో నిక్కచ్చిగా తెలుతుందని.. తద్వారా ఏ కులానికి నష్టం వాటిల్లకుండా రిజర్వేషన్ల అమలులో న్యాయం జరిగే అవకాశముందని వివరించారు.

ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్ విజయమంటూ ఆ పార్టీ నేతలు ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటని అన్నారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ కుల గణనకు వ్యతిరేకి. స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ఏనాడూ దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించకపోవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. జనగణన సమయంలో కూడా కులాన్ని చేర్చలేదుని.. కులగణన చేపట్టాలంటూ 2010లో దేశవ్యాప్తంగా చాలా రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తే ఈ అంశంపై మంత్రుల బృందాన్ని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నియమించింది. కానీ, కుల గణనకు బదులుగా సర్వే మాత్రమే నిర్వహించాలని నిర్ణయించిందే తప్ప శాస్త్రీయ పద్దతిలో కులగణన నిర్వహించనే లేదు. కేవలం ఓటు- బ్యాంకు రాజకీయాల కోసమే కులగణన అంశాన్ని కాంగ్రెస్ లెవనెత్తుతుందే తప్ప ఆ పార్టీకి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని అన్నారు. మోడీ సర్కార్ నిర్ణయం కాంగ్రెస్ ఘనతే అయితే డూప్లికేట్ గాంధీల ఏలుబడిలో కులగణన ఎందుకు చేయలేదో సమాధానం రాహుల్ గాంధీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు.

తెలంగాణసహా కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన ఈ కులగణన సర్వేలో పారదర్శకత లేనేలేదని అన్నారు. రాజకీయ లబ్ది కోసమే సర్వేలు నిర్వహిస్తూ తమకు అనుకూలమైన కులాల జనాభా పెంచుతూ, ఇతర కులాల జనాభాను తగ్గించే చూపే ప్రయత్నం చేశాయని.. తద్వారా సమాజంలో కులాల మధ్య కుమ్ములాటలు, అస్థిర పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ- రాబోయే జనాభా లెక్కింపులో కుల గణనను చేర్చాలని ఈరోజు నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. కేంద్ర నిర్ణయాన్ని రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు, కుల సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు స్వాగతిస్తూ సహకరించాలని విజ&ఘప్తి చేస్తున్నట్లు- తెలిపారు.

## గ్రూప్-1పై సింగిల్ బెంచ్ విచారణ

హైదరాబాద్: గ్రూప్-1 పరీక్షల వ్యవహారంపై హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం సైతం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపిస్తూ.. వరుస హాల్‌టికెట్ల వారికి ఒకే మార్కులు వచ్చాయని, నిర్దేశించిన సమయానికి ప్రొవిజనల్ మార్కుల జాబితా ఇవ్వలేదని కోర్టుకు వివరించారు. 20 రోజుల తర్వాత తుది మార్కులు వెల్లడించారని, ఆ 20 రోజుల్లో అవకతవకలు జరిగాయనే అనుమానంగా ఉందన్నారు. పిటిషనర్ల వాదనలు విన్న ధర్మాసనం.. మూల్యాంకన ప్రక్రియ గురించి టీజీపీఎస్సీని వివరాలు అడిగి తెలుసుకుంది. తెలుగులో రాసిన అభ్యర్థులకు ఎలా మార్కులు వేశారని ప్రశ్నించింది. తెలుగులో రాస్తే తక్కువ మార్కులేశారన్న ఆందోళన ఉంది. జవాబులకు సంబంధించి ఏదైనా కీ పేపర్ ఉంటుందా? తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల కీ ఇచ్చారా?' అంటూ టీజీపీఎస్సీకి ప్రశ్నలు సంధించింది. కాగా.. కమిషన్ స్పందిస్తూ ఎవాల్యుయేటర్లకు ఎలాంటి కీ ఇవ్వలేదని తెలిపింది. రాతపూర్వక పరీక్ష కావడంతో కీ ఇవ్వడం కుదరదని, జవాబు పత్రాలు దిద్దిన వారు ఆయా సబ్జెక్టుల్లో నిపుణులని కోర్టుకు వివరణ ఇచ్చింది. అయితే, తెలుగులో ఎంతమంది రాశారో, ఎంత మంది ఎంపికయ్యారో వారి వివరాలు ఇవ్వాలని టీజీపీఎస్సీని కోర్టు ఆదేశించింది. ఈ పరీక్షతోపాటు- గత గ్రూప్-1 అభ్యర్థుల సమాచారం కూడా ఇస్తామని టీజీపీఎస్సీ తెలిపింది. చాలా ఏళ్లుగా నిరుద్యోగులు గ్రూప్ - 1 కోసం ఎదురుచూస్తున్నారని, ఆలస్యం లేకుండా విచారణ ముగించాల్సి ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

## తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపు

న్యూఢిల్లీ:తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెంపు విషయంలో సుప్రీంకోర్టులో కీలక విచారణ జరిగింది. ఈ విషయంపై దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టి, తీర్పును రిజర్వు చేసింది. ఈ కేసు రాజకీయ, రాజ్యాంగ దృష్ట్యా రెండు రాష్ట్రాలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా నిలిచింది.

ఆంధ్రప్రదేశ్ రీ ఆర్గనైజేషన్ యాక్ట్, 2014లోని సెక్షన్ 26 ప్రకారం, ఏపీ, తెలంగాణలో అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచాలని చట్టం సూచిస్తుంది. ఈ నిబంధన అమలు చేయాలని కోరుతూ డాక్టర్ కె. పురుషోత్తమ్ రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ చట్టం ప్రకారం, రెండు రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల, రాజకీయ ప్రాతినిధ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గాల సంఖ్యను సమీక్షించి పెంచాల్సి ఉంటుంది. అయితే, గత కొన్నేళ్లుగా ఈ నిబంధన అమలు కాకపోవడంతో ఈ పిటిషన్ దాఖలైంది.

డాక్టర్ పురుషోత్తమ్ రెడ్డి తన పిటిషన్‌లో కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం సెక్షన్ 26ను అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ఈ నిబంధనను అమలు చేయాలని కేంద్రానికి, ఎన్నికల సంఘానికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరారు. ఈ విషయంపై గతంలో కూడా సుప్రీంకోర్టులో చర్చలు జరిగినప్పటికీ, తాజా విచారణ అంశం చర్చనీయాంశంగా మారింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కె.సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటీషన్‌పై విస్తృతంగా వాదనలు చేసింది. పిటిషనర్ తరఫున వాదిస్తూ, రెండు రాష్ట్రాల్లో జనాభా వృద్ధి, భౌగోళిక అవసరాల ఆధారంగా అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంచడం తప్పనిసరి అని ప్రస్తావించారు. ఏపీలో ప్రస్తుతం 175 అసెంబ్లీ సీట్లు-, తెలంగాణలో 119 సీట్లు- ఉన్నాయి. ఈ సంఖ్యను పెంచితే, ప్రజాప్రతినిధుల సంఖ్య పెరిగి, రాజకీయ ప్రాతినిధ్యం మరింత సమర్థవంతంగా ఉంటుందని వాదించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున వాదనలు విన్న ఎన్నికల సంఘం తమ స్థానాన్ని సమర్థించుకుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 ప్రకారం, 2026 తర్వాత జనాభా లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని వారు వాదించారు. అంతకుముందు సీట్ల పెంపు కోసం రాజ్యాంగ సవరణ అవసరమని, ఇది సంక్లిష్టమైన ప్రక్రియ అని పేర్కొన్నారు.

## వైభవంగా దేవినేని కుమారుడి వివాహం





విజయవాడ: తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడి వివాహ వేడుక ఘనంగా జరిగింది. నగర శివారు కంకిపాడులో జరిగిన ఈ వేడుకకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేశ్ తో పాటు- తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ముఖ్యనేతలు హాజరయ్యారు. నూతన వధూవరులు నిహార్, సాయి నర్మదలను వారు ఆశీర్వదించారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి విజయవాడ చేరుకున్న రేవంత్‌రెడ్డికి హెలిప్యాడ్ వద్ద ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి స్వాగతం పలికారు. రేవంత్, మంత్రి నారా లోకేశ్ కలిసి వివాహ వేడుక వద్దకు వచ్చారు.

## తెలంగాణ ఇస్తే పదేళ్లు దోపిడీ చేశావ్



హైదరాబాద్: భారాస రజతోత్సవ సభకు తాము సంపూర్ణంగా సహకరించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో బిఆర్ఎస్ ఇలా ఎప్పుడూ చేయలేదన్నారు. రవీంద్రభారతిలో నిర్వహించిన బసవేశ్వర 892 జయంతి వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు. పదో తరగతి పరీక్ష ఫలితాలను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల భారాస రజతోత్సవ వేడుకల్లో మాజీ సీఎం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలపై సీఎం దీటుగా స్పందించారు. ప్రతిపక్ష హోదా ఇచ్చిన ప్రజల వద్దకు ఎందుకు వెళ్లట్లేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వ పథకాలు నిలిపివేసినట్లు కేసీఆర్ చెబుతున్నారు. రైతుబంధు, రైతు రుణమాఫీ, ప్రజాపాలన ఆగిందా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయిందా? అని మండిపడ్డారు. విప్లవకారుడు అంటే తుపాకీ పట్టుకోవాల్సిన అవసరం లేదని, విప్లవాత్మక మార్పు తెచ్చే ఎవరైనా విప్లవకారుడని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ పై బసవేశ్వరుడు ప్రభావం ఎక్కువని సీఎం అన్నారు. ప్రభుత్వ తప్పిదాలు సరిదిద్దేలా ప్రతిపక్ష వ్యవస్థ ఏర్పాటు- చేసుకున్నామని అలాగే, ప్రజల అభివృద్ధి జీవన ప్రమాణాలు పెంచేలా రాజ్యాంగం ఏర్పాటు చేసుకున్నట్లు- ఆయన తెలిపారు. శాసన సభలో సభ నాయకుడిగా నేను, మంత్రులం అంతా పాల్గొన్నామని తెలిపారు. అయితే, నిన్నగాక మొన్న ఒకాయన వరంగల్ లో సభ పెట్టిండని, అయితే మాకేం అభ్యంతరం లేదన్నారు. ఇక సభకు ఎన్ని వందల బస్సులు అడిగితే అన్ని ఇవ్వండి అని మంత్రి పొన్నంకి చెప్పానని, అధికార పక్షమే కాదు.. ప్రతిపక్ష పార్టీ కూడా ఉండాలని అందుకు సహకరించామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అయితే, సభలో ప్రజల సమస్యలు ఏదైనా ప్రస్తావించారా..? మా లోపాలు చెప్పినవా..? మంచిని అభినందించావా..? అని ప్రశ్నించారు. ప్రభుత్వం నుండి జీత భత్యాలు తీసుకుంటు- న్నారు.. ఏ చట్టంలో ఉన్నది, జీతాలు తీసుకుని పని చేయడం అని అంటూనే.. అన్ని వసతులు అనుభవిస్తూ, ప్రతిపక్ష పాత్ర పోషించకపోతే ఎలా అంటూ మండి పడ్డారు. అసెంబ్లీకి తాను రాను.. పిల్లల్ని పంపిస్తా అంటాడని సీఎం పేర్కొన్నారు. అయితే, మీరెందుకు మరి ప్రతిపక్ష నాయకుడిగా ఉండటం..? మీకు ఎక్కడిది మమ్మల్ని అడిగే హక్కు.. ప్రతిపక్ష హోదా నీకు ఎందుకు? ఫార్మ్ హౌస్ లో పడుకుని ఏం సందేశం ఇస్తున్నారు? అధికారంలో ఉంటే చెలాయిస్తాం.. లేదంటే అసెంబ్లీకే రాను అంటే ఎట్లా? మేము ఇచ్చినవి అగినయి అంటున్నావు.. ఏమి అగినయని సీఎం ప్రశ్నించారు .మీరు సభకు రారు... కాబట్టి మేం ఏం చేస్తున్నామో ఎట్లా తెలుస్తుంది? మీరు ఏ మత్తులో జోగుతున్నారో తెలియదు.. విద్వేష పూరిత ప్రసంగం చేసి.. ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారాని సీఎం రేవంత్ ఆగ్రహించారు. పదేళ్లు మేమే అధికారంలో ఉంటాము.. అదే పదేళ్లు ఫార్మ్ హౌస్ లోనే ఉంటావు.. తర్వాత నీ చరిత్ర ఫార్మ్ హౌస్ లోనే పరిసమాప్తం అంటూ ఎద్దేవా చేసారు. మీ కుటుంబం పదేళ్లు దోచుకోలేదా..? దేని మీద చర్చ చేద్దామో చెప్పు, సభ పెడదాం రా.. ప్రతిపక్ష నాయకుడిగా నిర్ణయాల్లో తప్పులు ఉంటే చెప్పండి సరిదిద్దుకుంటామని సీఎం మాట్లాడారు. అలాగే విషం చిమ్మే మాటలు వద్దు, ఆయన మాటల్లో, కండ్లల్లో విషం.. విచక్షణ ఉండాలి కదా... ఏం మాట్లాడుతున్నామో అని అన్నారు. మేము తెలంగాణ ఇస్తే.. పదేళ్లు దోచుకుని మమల్ని విలన్ అంటున్నావని ఫైర్ అయ్యారు. ప్రజలు అనాలి.. మీరు తెలంగాణ ఇస్తే... ఆయన ఆగం చేశారని మమ్మల్ని అనాలి, నువ్వు కాదని సీఎం అన్నారు.

# సింహాచలం ఘటనపై చంద్రబాబు దిగ్భ్రాంతి



అమరావతి: సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి చందనోత్సవంలో గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందడంపై ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను కలచివేసిందన్నారు. భారీ వర్షాలతో గోడ కూలడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అక్కడి పరిస్థితిపై జిల్లా కలెక్టర్, ఎస్పీతో మాట్లాడినట్లు చెప్పారు. గాయపడిన వారికి చికిత్స అందించాలని ఆదేశించామన్నారు. సహాయకచర్యలపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి కేజీహెచ్‌కు వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ మేరకు పోలీసులు భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. మరోవైపు సింహాచలం ఘటన పై మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు, గాయపడిన వారికి రూ.3లక్షల చొప్పున పరిహారం అందజేయాలని సీఎం ఆదేశించారు. బాధిత కుటుంబ సభ్యులకు దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రులు అనిత, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, ఎంపీ భరత్, సింహాచల దేవస్థాన అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు. ప్రమాదం జరిగిన తీరు, క్షతగాత్రులకు అందుతున్న వైద్య సాయంపై సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనపై ముగ్గురు సభ్యుల కమిటీతో విచారణకు ఆయన ఆదేశించారు. మరోవైపు గోడ కూలిన ప్రదేశంలో శిథిలాలను వెంటనే తొలిగించి భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. సింహాచలం ఘటనపై ఉండవల్లిలోని నివాసంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.

ఈ సమావేశానికి డీజీపీ, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఘటన జరిగిన తీరు, బాధితులకు అందుతున్న సాయంపై అధికారులు సీఎంకు వివరించారు. దీనిపై విచారణకు ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ-లో పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఈగల్ చీఫ్ ఆకె రవికృష్ణ, ఇరిగేషన్ శాఖ ఇంజినీరింగ్ ఇన్‌చీఫ్ వెంకటేశ్వరరావును సభ్యులుగా చేర్చారు. 72 గంటల్లో ప్రాథమిక నివేదిక అందజేయాలని కమిటీని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## నగర పోలీసు కమిషనరేట్ పునః వ్యవస్థీకరణ

హైదరాబాద్: హైదరాబాద్ నగర పోలీసు కమిషనరేట్ పునః వ్యవస్థీకరణలో భాగంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కొత్త నిర్ణయాలు, వాటి వివరాలను నగర పోలీస్ కమిషన్ సివి ఆనంద్ తెలిపారు. హైదరాబాద్ నగర పోలీసు కమిషనరేట్ ను 35 సంవత్సరాల తర్వాత పోలీసు పునః వ్యవస్థీకరణ చేయడానికి ఉత్తర్వులు చేసారు. ఈ క్రమంలో పలువురు సిఐలను భారీగా బదిలీ చేశారు. కొత్త ఉత్తర్వుల ప్రకారం రెండు అదనపు లా అండ్ ఆర్డర్ జోన్‌లు (సౌత్ ఈస్ట్,సౌత్ వెస్ట్), 11 కొత్త లా అండ్ ఆర్డర్ డివిజన్‌లు, ఒకటి అదనపు ట్రాఫిక్ జోన్ (ట్రాఫిక్ 3), మరో 11 లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లు (మొత్తం 71), 13 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లు (మొత్తం 31) ఏర్పాటు చేసినట్లు- తెలిపారు. అలాగే నగరంలో ఉన్న 7 జోన్‌లకు 7 మహిళా పోలీస్ స్టేషన్‌లతో మహిళా భద్రతా విభాగం, ప్రత్యేక సైబర్ క్రైమ్ యూనిట్, ఐటీ- వింగ్, నార్కోటిక్స్ వింగ్ ఏర్పాటు చేసారు. ఈ మార్పుల కోసం అదనంగా 1200 మంది సిబ్బందిని మంజూరు చేసారు. గత 2 సంవత్సరాలుగా, పోలీసు స్టేషన్ హద్దులపై అలాగే కొత్త పోలీస్ స్టేషన్‌లకు వెళ్లడంలో ఎదురవుతున్న సమస్యలపై ప్రజల నుండి కొన్ని ఫిర్యాదులు వచ్చాయి. ట్రాఫిక్ పోలీసులకు, లా అండ్ ఆర్డర్ పోలీసులకు కొన్ని ప్రాంతాలలో అధికార పరిధిపై గందరగోళం ఉండటం, సైబర్ క్రైమ్ వింగ్‌ను మరింత బలోపేతం చేయవలసిన అవసరం ఉందని చర్చించి నివేదించడంతో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రభుత్వం పై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా మొత్తం హైదారాబాదు సిటీ పోలీసుకు మంజూరైన 17,020 మంది సిబ్బందిని అంతర్గత సర్దుబాటు, పునః కేటాయింపులు మార్పులతో ప్రతి పాదనలు ప్రభుత్వానికి పంపారు. అందుకు తెలంగాణ ప్రభుత్వం ఆమోదించింది. ఈ మార్పుల వలన రాబోయే పదేళ్ల వరకు హైదరాబాద్ నగర పోలీసులు బాగా పనిచేయటానికి అనుకూలంగా ఉంటుందని సిపి తెలిపారు. హైదరాబాద్ నగర పోలీసు పరిధిలో 72వ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌గా టోలిచౌకి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసారు. ఇంతకు ముందు ఉన్న ఫిల్మ్‌నగర్ పిఎస్, మెహదీపట్నం పిఎస్ , గోల్కొండ పిఎస్ పరిధిలో ఉన్న కొన్ని ప్రాంతాలను ఇప్పుడు కొత్తగా ఏర్పాటు- చేసిన టోలిచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలోకి తీసుకువచ్చారు. స్థానిక ప్రజలు తొందరగా గుర్తు పట్టడానికి వారికి అనువుగా ఒకటి లా అండ్ ఆర్డర్ డివిజన్ పేరు, మూడు లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లకు స్థానికంగా ప్రసిద్ధి చెందిన అలాగే స్థానిక సూచనలను ప్రతిబింబించేలా పేర్లు మార్చారు. గోల్కొండ డివిజన్‌ను ఇప్పుడు టోలిచౌకి డివిజన్ గాను, సెక్రటేరియట్ పిఎస్‌ను లేక్ పిఎస్‌గా ను, హుమాయున్ నగర్ పిఎస్‌ను మెహదీపట్నం పిఎస్ గాను, షాహినాయత్ గంజ్ పిఎస్‌ను గోషామహల్ పిఎస్‌గా పేరు మార్చారు.

లా అండ్ ఆర్డర్ డివిజన్ల ప్రకారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల హద్దులు ఉండాలని ప్రస్తుతము ఉన్న మారేడ్‌పల్లి, బోయిన్‌పల్లి, నారాయణగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను తీసేశారు. ఆగాగే ప్రస్తుతం ఉన్న లా అండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్ల పరిధి ప్రకారం వాటికి సంబంధించిన ఏరియాల్లో పనిచేయడానికి ట్రాఫిక్ నాంపల్లి పీఎస్, ట్రాఫిక్ అంబర్‌పేట్ పీఎస్, ట్రాఫిక్ లంగర్ హౌస్ పీఎస్, ట్రాఫిక్ బహదూర్‌పుర పీఎస్, ట్రాఫిక్ నల్లకుంట పీఎస్‌ల పేర్లు మార్చి ట్రాఫిక్ గాంధీ నగర్ పీఎస్, ట్రాఫిక్ ఉస్మానియా యూనివర్సిటీ- పీఎస్, ట్రాఫిక్ కుల్సుంపుర పీఎస్, ట్రాఫిక్ ఛత్రినాకా పీఎస్, ట్రాఫిక్ సైదాబాద్ పీఎస్ లుగా పేర్లు మార్చారు.

యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఏర్పాటు చేసారు. ఇందుకోసం ఒక ఇన్స్పెక్టర్, 8 సిబ్బంది

ఏర్పాటు- చేయగా.. జువెనైల్ బ్యూరో యూనిట్ కు - ఒక ఇన్స్పెక్టర్ తో 7 మంది సిబ్బంది ఉంటారు అని తెలిపారు. అలాగే ప్రతి లా అండ్ ఆర్డర్ జోన్‌లో ఒక సైబర్ క్రైమ్ సెల్‌లను ఏర్పాటు- చేసారు. ప్రస్తుత, భవిష్యత్ పోలీసింగ్ అవసరాలకు తగిన విధంగా లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలకు మంజూరైన సిబ్బంది సంఖ్యతో బలోపేతం చేశారు. పునర్వ్యవస్థీకరణలో జరిగిన మార్పులు అధికార పరిధి పటాలు, సంప్రదింపు, పోలీసు స్టేషన్ వివరాలు, పోలీస్ స్టేషన్ స్థానాలు త్వరలో హైదరాబాద్ సిటీ- పోలీస్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచబడతాయని ఆనంద్ తెలిపారు.

## సిఎస్‌గా రామకృష్ణారావు బాధ్యతలు స్వీకరణ

**అభినందనలు తెలిపిన మాజీ సిఎస్ శాంతికుమారి**

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కె. రామకృష్ణారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సిఎస్ శాంతి కుమారి పదవీవిరమణ చేయడంతో.. రామకృష్ణారావును ప్రభుత్వం నూతన సిఎస్ గా నియమించింది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి రామకృష్ణారావు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వచ్చే ఆగస్టులో ఆయన పదవీ విరమణ చేయనున్నారు. ఆయన తన సర్వీసులో నల్లగొండ జాయింట్ కలెక్టర్‌గా, గుంటూరు జిల్లా కలెక్టర్‌గా, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ జనరల్‌గా, 2016 నుంచి ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శిగా పనిచేశారు. 2021 నుంచి ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న కుడ్లిగి రామకృష్ణారావు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సిఎస్ శాంతికుమారితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. కొత్త సిఎస్‌కు ఆమె అభినందనలు తెలిపారు.

## డిగ్రీలు వస్తున్నా...స్కిల్స్ ఉండడం లేదు

హైదరాబాద్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో కష్టపడి చదివి డిగ్రీ తీసుకొని బయటకు వచ్చిన యువతకు స్కిల్స్ ఉండటం లేదని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆవేదన చెందారు. యువతలో స్కిల్స్ పెంచేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుందని అందు కోసమే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని అన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ న్యాక్ లోబుదవారం వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు కోమటి రెడ్డి ముఖ్య అథిదిగా హాజరయ్యారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీ÷-న్ ను, సోలార్ రూఫ్ టాప్, స్పేస్ అకాడమీ డబ్బింగ్ స్టూడియో ను, సి ఎస్ ఆర్ కింద ఐసీఐసీఐ బ్యాంక్ ఏర్పాటు చేసిన 100 కె వి సోలార్ ప్లాంట్ ను మంత్రి ప్రారంభించారు. సినిమా కోర్సులు నేర్చుకున్న 22 మంది బ్యాచ్ కు ఆయన సర్టిఫికెట్ లు అందచేశారు. ఈ సందర్భంగా కోమటి రెడ్డి మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగుమే పెద్ద సమస్యగా మారిందని, ఉద్యోగాలు లేక యువత మాదక ద్రవ్యాలకు బానిస అవుతుందని అన్నారు. నిరుద్యోగ సమస్యను ఎదుర్కొనేందుకు యువతకు వివిధ రంగాలలో స్కిల్ యూనివర్సిటీ- శిక్షణ ఇస్తుందన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కి సీఎం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మహిళలకు ఇళ్ళ నిర్మాణంలో మెస్త్రి ట్రైనింగ్ ఇచ్చి ఇందిరమ్మ ఇళ్ళ స్కీమ్ కింద చేపట్టే నిర్మాణాలు వారితోని చేయిస్తున్నామని కోమటిరెడ్డి అన్నారు. సినిమా టెక్నీషియన్ కు న్యాక్ లో శిక్షణ ఇస్తామని ఈ విషయంలో త్వరలో దిల్ రాజు , సినిమా వాళ్ళ తో సమావేశం ఏర్పాటు చేస్తున్నారన్నారు. నల్గొండ లో స్కిల్ -ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు- చేశామని ప్రతి ఏటా 10 వేల మందికి -ట్రైనింగ్ ఇస్తూ 100 శాతం జాబ్ ప్లేస్ మెంట్ కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. న్యాక్ ఎండి ఆర్ అండ్ బి స్పెషల్ సెక్రటరీ హరిచందన మాట్లాడుతూ స్కిల్ -ట్రైనింగ్ అనేది డిగ్రీ కాదని ఇది ఒక కోర్స్ అనే విషయం గమనించాలని నిత్యం స్కిల్స్ నేర్చుకుంటూ ఉండాలని అన్నారు. గత ఏడాది లో వివిధ కోర్స్ లో 25 వేల మందికి ట్రైనింగ్ ఇచ్చామని ఈ సంఖ్య ను రానున్న రోజుల్లో పెంచు తమని హరిచందన అన్నారు. ఇందులో 99 శాతం మందికి పెద్ద కంపెనీలు ఉద్యోగాలు ఇచ్చాయని తెలిపారు.

# పది ఫలితాల్లో "సత్యశోధక్" విజయభేరి.

**- మండలం టాపర్ గా నిలిచిన కె. శివ (581/600).**



K. SHIVA 581/600
సిరికొండ మండల్ టాపర్



V. SAHARSHA 573/600



R. RACHANA 572/600

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, ఏప్రిల్ 30:**

పదవ తరగతి 2025 ఫలితాలలో సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయభేరి మ్రోగించారు. పాఠశాలకు చెందిన కె. శివ (581/600) సాధించి మండల టాపర్ గా నిలిచాడు. అలాగే వి. సహర్ష (573/600), ఆర్. రచన (572/600) మార్కులు సాధించారు. 560కి పైగా మార్కులు 26 మంది విద్యార్థులు, 500 పైగా 73 మంది విద్యార్థులు సాధించడంతో పాటు వందశాతం 88/88 ఉత్తీర్ణత సాధించారు. నిరంతర శ్రమ, పట్టుదల ఆత్మవిశ్వాసంతో విద్యాభ్యాసం చేస్తే అద్భుత ఫలితాలు సాధించగలమని అందుకు ఈ అత్యుత్తమ ఫలితాలే నిదర్శనమనీ పాఠశాల ప్రిన్స్ పాల్ ఆర్. నర్సయ్య అన్నారు. గ్రామీణ ప్రాంతంలో నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థుల సర్వతోముకాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ అత్యుత్తుమ ఫలితాలను సాధిస్తున్న ఏకైక పాఠశాల సత్యశోధక్ పాఠశాల అని పేర్కొన్నారు. ఈ విజయాల కృషిలో భాగాస్వాములైన బోధన సిబ్బందికి, సంపూర్ణ సహాకారం అందించిన విద్యార్థుల తల్లిదండ్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# నగరంలో నుడా చైర్మన్ కేశవేణు పర్యటన.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 30:**



నుడా చైర్మన్ కేశవేణు బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సదర్భంగా వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం తీవ్రమైన సమస్యగా మారే అనేక లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఇది చాలా మంది నివాసితుల జీవితాలను ప్రభావితం చేస్తుందని, ఈ సమస్యలను పరిష్కరించడానికి, ఈ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి రూ. 100 కోట్ల అంచనా బడ్జెట్ ప్రతిపాదించబడిందని అన్నారు. ఈ వర్షాకాలంలో వీలైనన్ని ఎక్కువ పనులను పూర్తి చేయాలని, మిగిలిన లేదా పెండింగ్ పనులు వచ్చే వర్షాకాలం నాటికి పూర్తిగా పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళీ మనోహర్ రెడ్డి, ఏఈ వాజిద్ ఖాన్, రషీద్ ఖాన్ ఉన్నారు.

# ఎస్ఎస్ సిలో "లయోల" విద్యార్థుల ప్రభంజనం.



570 PRANITHA REDDY



567 HARSHAVARDHAN



566 HURIYA DILSHATH



566 ANOOP KUMAR C.



564 KRUTHIK J.



563 AKSHARA G.



562 SRIMAHI P.



560 RISHIK T.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, ఏప్రిల్ 30**

: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని లయోలా హై స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. పరీక్షకు హాజరైన 103 మందిలో 500/600 పైగా మార్కులను 71 మంది విద్యార్థులు సాధించారు. 450/600 మార్కులకు పైగా 23 మంది, 400/600 మార్కులకు పైగా 9 మంది విద్యార్థులు సాధించారు. ఎస్ఎస్ సి 2008 మొదటి బ్యాచ్ నుండి నేటి 18వ బ్యాచు వరకు ప్రతి యేట 100% ఉత్తీర్ణత పాఠశాల సాధించడంగర్వంగా ఉందని ప్రధానోపాధ్యాయులు వీరాచారి అన్నారు. ఈ విజయానికి సహకరించిన యాజమాన్య సభ్యులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యార్థులందరికి పాఠశాల తరపున అభినందనలు తెలిపారు.



## రేపటి నుంచి హాస్టల్స్ మూసివేత..

హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయం మే 1 నుండి మే 31 వరకు వేసవి సెలవులు ప్రకటించి.. క్యాంపస్‌లోని హాస్టళ్లు , మెస్‌లను మూసివేసింది. రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు.. నీరు, విద్యుత్ కొరత కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. జూన్ 1న తిరిగి తెరుస్తామని అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియ విద్యార్థులకు కొంత ఆర్థిక భారం కలిగించే అవకాశం ఉంది. ఈ చర్య విద్యార్థుల్లో చర్చనీయాంశంగా మారింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు ముఖ్యమైన ప్రకటన వెలువడింది. విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని హాస్టళ్లు , మెస్‌లను రేపటి నుండి అంటే మే 1వ తేదీ నుండి మే 31వ తేదీ వరకు పూర్తిగా మూసివేయనున్నట్లు చీఫ్ వార్డెన్ తాజాగా ఒక సర్క్యులర్ ద్వారా తెలియజేశారు. ఈ నిర్ణయానికి ప్రధాన కారణం రాష్ట్రంలో పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతలు, తాగునీరు, విద్యుత్ కొరత తీవ్రంగా ఉండటమేనని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ఈ క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులందరూ సహకరించాలని విశ్వవిద్యాలయ అధికారులు విజ్ఞప్తి చేశారు.

ఈ ఉత్తర్వులు మే 31వ తేదీ వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. అనంతరం, జూన్ 1వ తేదీన తిరిగి హాస్టళ్లు , మెస్‌లను తెరుస్తామని అధికారులు తెలిపారు. అయితే.. ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో వేసవి సెలవులు ప్రకటించడం.. హాస్టళ్లు, మెస్‌లను ఒక నెల రోజుల పాటు మూసివేయడం ప్రస్తుతం విద్యార్థుల్లో, విద్యా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా విశ్వవిద్యాలయాలు విద్యా సంవత్సరం ముగిసిన తర్వాతే వేసవి సెలవులు ప్రకటిస్తాయి. మధ్యలో ఇలా సెలవులు ఇవ్వడం.. హాస్టళ్లను మూసివేయడం చాలా అరుదుగా జరుగుతుంది.

ఈ నిర్ణయంపై విద్యార్థులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు విద్యార్థులు రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా విశ్వవిద్యాలయం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తున్నారు. మరికొందరు మాత్రం తమ చదువుకు అంతరాయం కలుగుతుందని ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా పరిశోధన చేసే విద్యార్థులు.. పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ఈ సెలవులు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. విశ్వవిద్యాలయం ఈ సమయంలో విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు లేదా ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తుందా అనేది వేచి చూడాలి.

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణ రాష్ట్రంలోని పురాతన.. ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయాలలో ఒకటి. ఇక్కడ రాష్ట్రం నలుమూలల నుండి విద్యార్థులు వచ్చి చదువుకుంటారు. విశ్వవిద్యాలయంలో ఎక్కువ సంఖ్యలో హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో వేలాది మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. హాస్టళ్లు మూసివేయడం వల్ల ఈ విద్యార్థులందరూ నెల రోజుల పాటు తమ స్వస్థలాలకు వెళ్లాల్సి ఉంటుంది. తిరిగి జూన్ 1న విశ్వవిద్యాలయం తెరిచిన తర్వాత వారు మళ్లీ రావాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ విద్యార్థులకు కొంత ఆర్థిక భారం కలిగించే అవకాశం ఉంది.

# నెల రోజుల్లోపే స్కై వాక్ అందుబాటులోకి..



హైదరాబాద్: మెహిదీపట్నం జంక్షన్ వద్ద పాదచారుల కష్టాలు తీర్చేందుకు హెచ్ఎండీఏ నిర్మిస్తున్న స్కైవాక్ జూన్ నాటికి పూర్తి కానుంది. రక్షణ శాఖ అనుమతి ఆలస్యం కావడంతో పనులు ఆలస్యమైనప్పటికీ.. ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి. 3,380 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ. 32.97 కోట్లతో నిర్మిస్తున్న ఈ స్కైవాక్‌లో 5 ప్రవేశ/నిష్క్రమణ మార్గాలు, 2 టన్నెల్ మార్గాలు ఉంటాయి. రైతుబజార్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు పాదచారులకు సురక్షితమైన మార్గం లభిస్తుంది. వాణిజ్య ప్రాంతంలో షాపులు ఏర్పాటు చేసి ఆదాయం పొందనున్నారు.

హైదరాబాద్ నగరంలోని మెహిదీపట్నం జంక్షన్ వద్ద నిత్యం ఎదురయ్యే పాదచారుల కష్టాలకు త్వరలోనే తెరపడనుంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఇక్కడ నిర్మిస్తున్న అత్యాధునిక స్కైవాక్ పనులు వచ్చే జూన్ నాటికి పూర్తి చేసేందుకు శరవేగంగా కృషి చేస్తోంది. ఇప్పటికే స్కైవాక్‌లోని రెండు వైపులా నడిచేందుకు వీలైన మార్గాల నిర్మాణం దాదాపుగా పూర్తయింది. అంతేకాకుండా.. మెహిదీపట్నం బస్టాండ్ సమీపంలో నిర్మిస్తున్న వాణిజ్య సముదాయం పనులు కూడా వేగంగా సాగుతున్నాయి.

వాస్తవానికి ఈ స్కైవాక్ నిర్మాణం ముందుగానే పూర్తి కావాల్సి ఉండగా.. రక్షణ శాఖ కోరిన కొన్ని ప్రత్యేకమైన డాక్యుమెంట్లను సమర్పించడంలో జరిగిన ఆలస్యం.. ఇతర సాంకేతిక కారణాల వల్ల కొంత జాప్యం జరిగింది. అయితే.. తాజాగా సంబంధిత రక్షణ శాఖ నుంచి అనుమతి లభించడంతో పనుల్లో వేగం పెంచారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావాలని హెచ్ఎండీఏ అధికారులు పట్టుదలగా ఉన్నారు.

ఈ స్కైవాక్‌ను మొత్తం 3,380 చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రత్యేకంగా డిజైన్ చేశారు. దీని నిర్మాణానికి దాదాపు రూ. 32.97 కోట్లు ఖర్చు చేస్తున్నారు. మెహిదీపట్నం బస్‌బే ప్రాంతం నుంచి రైతుబజార్ వరకు.. ఇతర ముఖ్యమైన మార్గాల నుంచి పాదచారులు సులభంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా దీనిని నిర్మిస్తున్నారు. ప్రజల సౌకర్యం కోసం మొత్తం 5 వేర్వేరు ప్రాంతాల్లో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఏర్పాటు చేయనున్నారు. స్కైవాక్‌కు ఇరువైపులా రెండు ప్రత్యేకమైన టన్నెల్ మార్గాలు కూడా అందుబాటులోకి రానున్నాయి.

**మొత్తం 3,380 చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రత్యేకంగా డిజైన్ చేశారు. దీని నిర్మాణానికి దాదాపు రూ.32.97 కోట్లు ఖర్చు చేస్తున్నారు. మెహిదీపట్నం బస్‌బే ప్రాంతం నుంచి రైతుబజార్ వరకు.. ఇతర ముఖ్య మైన మార్గాల నుంచి పాదచారులు సుల భంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా దీనిని నిర్మిస్తున్నారు. ప్రజల సౌకర్యం కోసం మొత్తం 5 వేర్వేరు ప్రాంతాల్లో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఏర్పాటు చేయనున్నారు.**

ముంబయి జాతీయ రహదారిపై ఉన్న అత్యంత రద్దీ ప్రాంతమైన రైతుబజార్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యలను తగ్గించడమే ఈ స్కైవాక్ ప్రధాన లక్ష్యం. దాదాపు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో వాణిజ్య ప్రాంతాన్ని కూడా అభివృద్ధి చేస్తున్నారు. దీనివల్ల నిత్యం వేలాది మంది వాహనాలతో రద్దీగా ఉండే మెహిదీపట్నం జంక్షన్‌ను పాదచారులు ఎటువంటి ప్రమాదం లేకుండా దాటేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మెహిదీపట్నం బస్టాప్‌తో పాటు రైతుబజార్ ప్రాంతంలో రోజూ వేలాది మంది ప్రజలు రోడ్డు దాటుతుంటారు. ఈ సమయంలో వాహనాలు వేగంగా వెళ్లడం వల్ల తరచూ పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికే హెచ్ఎండీఏ ఇక్కడ స్కైవాక్ నిర్మాణాన్ని చేపట్టింది.

ఇంట్లో గొడవ పడి డ్రైవింగ్ చేయొద్దు.. ఈ స్కైవాక్‌లో ఆధునిక సౌకర్యాలైన ఎలివేటర్లు, రెండు ఇంటర్మీడియట్ టన్నెల్ వాక్‌లు, రైతుబజార్, డిఫెన్స్ కాంపౌండ్ వాల్, బస్‌బే ఏరియా, ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ మరియు రేమాండ్ షోరూమ్ ప్రాంతా ల్లో ప్రవేశ, ఎగ్జిట్ మార్గాలు ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా.. వాణిజ్య ప్రాంతంలో కాఫీ షాపులు, వివిధ రకాల లాంజ్‌లను ఏర్పాటు చేసి వాటిని అద్దెకు ఇవ్వడం ద్వారా హెచ్ఎండీఏ ఆదాయం పొందేలా కూడా దీనిని డిజైన్ చేశారు. ప్రస్తుతం టన్నెల్ మార్గాల పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే లిఫ్ట్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు.

# ఇల్లు అద్దెకు ఇస్తున్నారా..? నమ్మితే అంతే..!



హైదరాబాద్: మీరు ఆన్‌లైన్‌లో మీ ఇంటిని అద్దెకు ఇవ్వడానికి ప్రకటన పెట్టినట్లయితే తస్మాత్ జాగ్రత్త. మిమ్మల్ని ఆర్మీ అధికారిగా లేదా ప్రభుత్వ అధికారిగా పరిచయం చేసుకుని సైబర్ కేటుగాళ్లు మోసం చేసే ఛాన్స్ ఉంది. అద్దె అడ్వాన్స్ పంపుతామని చెప్పి.. తమ చెల్లింపులు రివర్స్ మోడ్‌లో ఉంటాయని నమ్మబలికే ప్రయత్నం చేయవచ్చు. వారి మాయమాటలు నమ్మితే.. నిండా మునిగే ఛాన్స్ ఉంది. కాబట్టి ఈ కొత్త తరహా మోసాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

ఈ రోజుల్లో రకరకాల సైబర్ మోసాలు వెలుగులోకి వస్తున్నాయి. సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతులతో అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. ఈజీ మనీకి అలవాటుపడి చాలా తెలివిగా ప్లాన్ చేసిన మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా.. రివర్స్ మోడ్ పేమెంట్ అంటూ అమాయకులకు వల విసురుతున్నారు. ఇల్లు అద్దెకు ఇచ్చేవారిని టార్గెట్ చేస్తూ నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. సికింద్రాబాద్‌లో ఇల్లు అద్దెకు ఇవ్వబోయిన ఒక మహిళ సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయింది. ఆర్మీ అధికారిగా పరిచయం చేసుకున్న ఒక వ్యక్తి.. అద్దె చెల్లింపులు రివర్స్ మోడ్‌లో ఉంటాయని నమ్మించి ఆమె నుంచి రూ. 1.31 లక్షలు కాజేశాడు. ఆన్‌లైన్‌లో ఫ్లాట్ అద్దెకు ఉందని ప్రకటన చూసిన సైబర్ కేటుగాడు.. బాధితురాలికి ఫోన్ చేసి తాను ఆర్మీలో పనిచేస్తున్నానని చెప్పాడు. అడ్వాన్స్ పంపుతానని నమ్మించి, ఆర్మీ చెల్లింపులు రివర్స్ మోడ్‌లో జరుగుతాయని మాయమాటలు చెప్పాడు. అది నమ్మిన మహిళ డబ్బులు పంపగా.. ఆ తర్వాత సదరు కేటుగాడు ఫోన్ స్విచ్చాఫ్ చేశాడు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సైబర్ మోసాలపై ప్రజలకు ఎంత అవగాహన కల్పిస్తున్నా.. నేరగాళ్లు మాత్రం కొత్త పద్ధతులతో అమాయకులను టార్గెట్ చేస్తూనే ఉన్నారు. రివర్స్ పేమెంట్ మోడ్ పేరుతో జరుగుతున్న ఈ తరహా మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఈ తరహా మోసాలు హైదరాబాద్ నగరంలో చాలానే జరుగుతున్నాయి. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఒక వ్యక్తిని ముంబై పోలీసులుగా చెప్పుకున్న సైబర్ నేరగాళ్లు ఒక కేసులో ఇరికించామని బెదిరించి, వెరిఫికేషన్ పేరుతో రూ. 3.5 లక్షలు కాజేశారు. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరు దేశవ్యాప్తంగా 13 ఇలాంటి మోసాల్లో పాల్గొన్నట్లు గుర్తించారు. మరో కేసులో ఒక వ్యాపారవేత్తను సైబర్ నేరగాళ్లు అధిక లాభాల పేరుతో మోసం చేశారు. రూ. 9.5 లక్షలు వారి బ్యాంకు ఖాతాకు బదిలీ చేసుకున్న తర్వాత ఫోన్ స్విచ్చాఫ్ చేశారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు వెంటనే స్పందించి నిందితులను ఢిల్లీలో అరెస్ట్ చేసి బాధితుడికి డబ్బును తిరిగి ఇప్పించారు.

## వేసవి సెలవులు.. రేపటి నుంచి ఇంటి వద్దకే గుడ్లు..

తెలంగాణ: మే 1 నుండి జూన్ 1 వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు ఇంటి వద్దకే పోషకాహారం సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అంగన్‌వాడీ టీచర్లను ఇతర విధుల్లో వినియోగించడం ద్వారా మానవ వనరులను సమర్థవం తంగా ఉపయోగించుకోవచ్చు. ఈ చర్యలు ప్రభుత్వ చిత్తశుద్ధిని.. ప్రజల సంక్షేమం పట్ల దాని నిబద్ధతను చాటుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు రేపటి నుండి.. అంటే మే 1వ తేదీ నుండి వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో తీవ్రంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అంగన్‌వాడీ కేంద్రాలకు మే 1వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు సెలవులు వర్తిస్తాయి. ఈ వేసవి విరామ సమయంలో.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధి పొందే గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు పోషకాహారాన్ని వారి ఇళ్ల వద్దకే సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## సూర్యాపేట-సిరిసిల్ల నేషనల్ హైవే..
# రైతులకు నో టెన్షన్



సూర్యాపేట: నేషనల్ హైవే అలైన్‌మెంట్ మార్పు చేయాలనే రైతుల డిమాండ్‌కు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు సానుకూలంగా స్పందించారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు, రైతుల బృందంతో కలిసి ఢిల్లీ వెళ్లి కేంద్ర అధికారులను కలిశారు. రాజీవ్ రహదారి, సిద్ధిపేట ఔటర్ రింగ్ రోడ్డుతో అనుసంధానం చేసే కొత్త అలైన్‌మెంట్‌ను పరిశీలించాలని ప్రతిపాదించగా, అధి కారులు పాత భూసర్వే నిలిపివేసి కొత్త మార్గంపై పరిశీలనకు అంగీకరించారు. దీంతో భూములు కోల్పోతున్న రైతులకు ఊరట లభించిందిసూర్యాపేట నుండి సిద్ధిపేట మీదుగా సిరిసిల్లకు వెళ్లే 365బీ జాతీయ రహదారి అలైన్‌మెంట్ మార్చడానికి నేషనల్ హైవే అథారటీ ఆఫ్ ఇండియా అధికారులు సూత్రప్రాయంగా అంగీకరించారు. రైతుల భూములను కాపాడేందుకు కొత్త మార్గాన్ని పరిశీలించడానికి వారు సానుకూలంగా స్పందించారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు రైతుల ప్రతినిధి బృందంతో కలిసి ఢిల్లీ వెళ్లి జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి ఉమా శంకర్‌ను కలిశారు. రైతులు నష్టపోకుండా రాజీవ్ రహదారి, సిద్ధిపేట ఔటర్ రింగ్ రోడ్డుతో అనుసంధానం చేయాలని ప్రతిపాదించారు.

# ఎస్ఎస్ సిలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ "కాకతీయ" సొంతం.




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 30**

తెలంగాణలో బుధవారం విడుదలైన పది పరీక్ష ఫలితాల్లో నగరంలోని కాకతీయ (కెఓఎస్) విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. విద్యార్థి ఎస్. క్రితి 596/600 మార్కులతో స్టేట్ మెదటి ర్యాంకు సాధించింది. అలాగే 6, 7, 10, 11, 12, 13, 14, 15, 16, 17 స్టేట్ ర్యాంకులు సైతం సాధించి సత్తా చాటారు. డిఇఓ అశోక్ కుమార్, కాకతీయ విద్యా సంస్థల చైర్మన్ విజయలక్ష్మి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కాకతీయ విద్యా సంస్థల చైర్మన్ విజయలక్ష్మి మాట్లాడుతూ, పదోతరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడం సంతోషంగా ఉందని అన్నారు. కాకతీయ విద్యార్థి ఎస్. క్రితి 596/600 మార్కులతో స్టేట్ మెదటి ర్యాంకు సాధించిందని తెలిపారు. నితేష్ 591/600 మార్కులతో స్టేట్ ఆరో ర్యాంకు, ఎస్ఎన్వీ అఖిల్ 590/600 మార్కులతో స్టేట్ ఏడో ర్యాంకు, డి. క్రుతి 587/600 మార్కులతో స్టేట్ 10వర్యాంకు, సాయి శ్రేయస్ 586/600 మార్కులతో స్టేట్ 11వ ర్యాంకు, జి.వర్షిణి 586/600 మార్కులతో స్టేట్ 11వ ర్యాంకు, కౌషిక్ ప్రసాద్ 585/600 మార్కులతో స్టేట్ 12వ ర్యాంకు, అబిబా సిద్దిఖి 585/600 మార్కులతో స్టేట్ 12వ ర్యాంకు, గౌతమ్ 585/600 స్టేట్ 13 ర్యాంకు, జశ్వంత్ 584/600 మార్కులతో స్టేట్ 14వ ర్యాంకు, ఆశా 583/600 మార్కులతో స్టేట్ 15వ ర్యాంకు, ఎస్. భవాని 582/600 మార్కులతో స్టేట్ 15వ ర్యాంకు, జె.యోచన 582/600 మార్కులతో స్టేట్ 15వర్యాంకు, బి.ఆకర్ష 581/600 మార్కులతో స్టేట్ 16వ ర్యాంకు, కె.సహస్ర 580/600 మార్కులతో స్టేట్ 17వ ర్యాంకు సాధించారని తెలిపారు. అనుభవం గల ఉపాధ్యాయులు విద్యార్థులపై అనునిత్యం తమ పర్యవేక్షణ కలినిగిన ఇంచార్జీలు, నాన్ టీచింగ్ సిబ్బంది, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్ల ఈ విజయం సాధించామన్నారు. కాకతీయ ఒలంపియాడ్ లో స్కూల్ స్థాయి నుంచే ఐఐటి ఉండటం వల్ల ప్రణాళికా బద్ధంగా అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విద్యా సంస్థల డైరెక్టర్ లు సిహెచ్. రామోజీ రావు, తేజస్విని, రాజ, కాకతీయ కళాశాలల ప్రిన్సిపాల్ రణదీశ్ , ఒలంపియాడ్ స్కూల్ ప్రిన్సిపాల్స్ నటరాజ్, గిరిధర్ రాజ్, చంద్ర శేఖర్, వైస్ ప్రిన్సిపాల్ కవిత, సంతోష్, ఫనింధర్ తదితరులు పాల్గొన్నారు.

- ఎస్. క్రితి 596/600 మార్కులతో రాష్ట్రంలోనే మొదటి స్థానం.
- 6, 7, 10, 11, 12, 13, 14, 15, 16, 17 స్టేట్ ర్యాంకులు సైతం సాధించి సత్తా చాటారు.
- విద్యార్థులను అభినందించిన డిఇఓ అశోక్ కుమార్.
- సంతోషం వ్యక్తం చేసిన కాకతీయ విద్యా సంస్థల చైర్మన్ విజయలక్ష్మి.
- పాల్గొన్న విద్యా సంస్థ డైరెక్టర్లు సిహెచ్. రామోజీ రావు, తేజస్విని, రాజ.




# పది ఫలితాల్లో "నలంద" హవా.




**హర్షం వ్యక్తం చేసిన యాజమాన్యం ప్రసాద్, సాగర్.**

**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, ఏప్రిల్ 30:**

పట్టణంలోని నలంద హైస్కూల్ విద్యార్థులు పదవ తరగతి ఫలితాలలో తమ సత్తా చాటారు. బుధవారం విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో నలంద స్కూల్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎన్. స్విజన్ రెడ్డి (కలిగోట్) 575/ 600, ఎన్. భావనా రెడ్డి (నడుకుడా) 564/600, బి. సంకీర్తన , (నడుకుడా) 555/600, ఎస్ కె. హలీమా (మామిడిపల్లి) 554/600, టి. రక్షిత (సికింద్రాబాద్) 546/600, సిహెచ్. వరుణ్ తేజ్ (చెంగల్) 542/600 మార్కులతో ప్రతిభను చాటారు. 500 పైన మార్కులు 23 మంది విద్యార్థులు సాధించారాని నలంద యాజమాన్యం ప్రసాద్, సాగర్ తెలిపారు. విద్యార్థులను యాజమాన్యం శాలువా, పుష్పగుచ్చలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా యాజమాన్యం ప్రసాద్, సాగర్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం 100 శాతం ఉత్తీర్ణత , ఆర్మూర్ మండలం ప్రైవేట్ స్కూళ్లలో అత్యధిక మార్కులు సాధించిన విద్యా సంస్థగా నిలవడం గర్వకారణంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# పది ఫలితాల్లో "ఆర్కిడ్స్" ప్రభంజనం.




**100 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు.**
**అభినందించిన పాఠశాల చైర్మన్ సి హెచ్. గోవర్ధన్ రెడ్డి.**




**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, ఏప్రిల్ 30:**

పదవ తరగతి ఫలితాల్లో ఆర్కిడ్స్ హైస్కూల్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించారు. మొత్తం 48 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, వందశాతం ఉత్తీర్ణులు కావడం గర్వకారణం.

**ప్రథమ ర్యాంకు: 576/600 కె. శ్రీలాస్య.**

576 కె. శ్రీలాస్య, 568 కె. మేదశ్రీ, 566 వర్షిత, 566 కె. అక్షయ్, 560 యన్. రుత్విక్ మార్కులను సాధించారు.

**550 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు: 9**

పాఠశాలకు చెందిన 9 మది విద్యార్థులు 550 పైగా మార్కులు సాధించగా, 35 మంది 500 పైగా మార్కులు సాధించారు. 48 మంది విద్యార్థుల ఉత్తీర్ణతతో 100 శాతం తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా ఆర్కిడ్స్ స్కూల్ ప్రిన్సిపల్ అండ్ చైర్మన్ సిహెచ్. గోవర్ధన్ రెడ్డి, కరస్పాండెంట్ యం. జైపాల్ రెడ్డి, డైరెక్టర్ యం. సదాశివ రెడ్డి విద్యార్థుల కృషికి, ఉపాధ్యాయుల మార్గనిర్దేశనకు, తల్లిదండ్రుల సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు, విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## కులగణన ఎప్పట్లోగా చేస్తారో చెప్పండి: రాహుల్



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కులగణనకు కేంద్రం నిర్ణయం తీసుకోవడాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్వాగతించారు. కులగణనకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు చెప్పారు. అయితే ఎప్పట్లోగా కులగణన చేస్తారో చెప్పాలన్నారు. "కులగణన చేపడతామని మేము పార్లమెంటులో చెప్పాం. 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తేస్తామని కూడా చెప్పాం. ఈ విషయాలపై ప్రధానమంత్రి మోదీ మూడు నాలుగు సందర్భాల్లో మాత్రమే మాట్లాడారు. 11 ఏళ్ల తర్వాత అకస్మాత్తుగా ఏమి జరిగిందో కానీ కులగణన చేపట్టేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. మేము దీనికి పూర్తిగా మద్దతిస్తున్నాం. కానీ ఎప్పటిలోగా కులగణన చేపడతారో చెప్పాలని టైమ్ లైన్ అడుగుతున్నాం. బీహార్‌లో కులగణనకు తెలంగాణలో కులగణనకు తేడా ఉంది. తెలంగాణలో పారదర్శకంగా కులగణన జరిగింది" అని రాహుల్ పేర్కొన్నారు.

## ఏపీ, తెలంగాణ అసెంబ్లీ సీట్ల పెంపు.. సుప్రీంకోర్టు తీర్పు రిజర్వు


తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెంపు విషయంలో సుప్రీంకోర్టులో కీలక విచారణ జరిగింది. ఈ విషయంపై దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టి, తీర్పును రిజర్వు చేసింది. ఈ కేసు రాజకీయ, రాజ్యాంగ దృష్ట్యా రెండు రాష్ట్రాలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా నిలిచింది.

## మోదీ రష్యా పర్యటన రద్దు

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రష్యా పర్యటన రద్దయింది. షెడ్యూల్ ప్రకారం మే 9న రష్యాలో జరిగే "విక్టరీ డే" సెలబ్రేషన్స్‌లో మోదీ పాల్గొనాల్సి ఉంది. అయితే ఆయన పర్యటన రద్దయినట్టు క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ తెలిపారు. పహల్గాంలో 26 మంది టూరిస్టులను ఉగ్రవాదులు కాల్చిచంపడంతో భారత్-పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

రెండో ప్రపంచ యుద్ధంలో జర్మనీపై సోవియట్ రష్యా విజయానికి చిహ్నంగా 80వ 'విక్టరీ డే 'ను రష్యా జరుపుకోనుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2024 జూలైలో రష్యాలో పర్యటించారు. దానికి ముందు 2019లో వ్లాడివోస్టోక్ సిటీలో జరిగిన ఎకనామిక్ కాంక్లేవ్‌లో పాల్గొన్నారు.

## జాతీయ భద్రతా సలహా బోర్డు చైర్మన్‌గా అలోక్ జోషి



పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా జాతీయ భద్రతా సలహా బోర్డును పునర్వ్యవస్థీకరించింది. అలాగే 'రా' మాజీ చీఫ్ అలోక్ జోషిని ఆ బోర్డు చైర్మన్‌గా నియమించింది. ఈ ఘటన వేళ ఈ నియామకం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయనతో పాటు ఆరుగురు సభ్యులు ఉన్నారు.

భారత సైన్యంలో పనిచేసిన మాజీ అధికారులు ఎయిర్ మార్షల్ పీఎం సిన్హా, లెఫ్టినెంట్ జనరల్ ఏకే సింగ్, అడ్మిరల్ మోంటీ ఖన్నా, మాజీ ఐపీఎస్‌లు రాజీవ్ రంజన్ వర్మ, మన్మోహన్ సింగ్, మాజీ ఐఎఫ్ఎస్ బి.వెంకటేశ్ వర్మ సభ్యులుగా ఉన్నారు. భద్రతా వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ భేటీలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటు రాజకీయ, ఆర్థిక వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ సమావేశాలు కూడా జరిగాయి.

## రూ.2వేల కోట్ల స్కామ్.. ఆప్ నేతలపై ఏసీబీ కేసు

పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణాల్లో



అవినీతికి పాల్పడ్డారంటూ దిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ నేతలపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఇందులో ఆప్ మాజీ మంత్రులు మనీశ్ సిసోదియా, సత్యేందర్ జైన్‌లు ఉన్నారు.

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆప్ ప్రభుత్వ హయాంలో సిసోదియా విద్యాశాఖ మంత్రిగా, సత్యందర్ జైన్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) మంత్రిగా ఉన్నారు. వారి నేతృత్వంలో దిల్లీలో 12,748 పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణం తలపెట్టారు. ఈ నిర్మాణంలో రూ.2వేల కోట్ల అక్రమాలు జరిగాయి. 34 మందికి దీని కాంట్రాక్టులు దక్కాయి. వారిలో చాలామందికి ఆప్‌తో దగ్గర సంబంధాలు ఉన్నట్లు తేలింది. నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తికాకపోగా, భారీగా ఖర్చు చేశారు. తరగతి గదులను 30 సంవత్సరాలకు ఉండేలా కడితే.. వాటికి అయిన ఖర్చు మాత్రం 75ఏళ్లు ఉండేలా అయ్యింది. గడువు ప్రక్రియను పాటించకుండా కన్సల్టెంట్లు, ఆర్కిటెక్ట్‌లను నియమించుకోవడంతో దాదాపు ఐదు రెట్లు వ్యయం పెరిగిపోయింది.





# వన్నె తగ్గిన పసిడి.. 15 శాతం పడిపోయిన డిమాండ్

అధిక ధరల కారణంగా పసిడి వన్నె తగ్గింది. జనవరి-మార్చి మధ్య కాలంలో డిమాండ్ 15 శాతం పడిపోయి, 118.1 టన్నులకు చేరిందని బుధవారం ప్రపంచ స్వర్ణ మండలి వెల్లడించింది. ధరలు ఎక్కువగా ఉండటంతో విలువపరంగా చూసుకుంటే 22 శాతం పెరిగి, రూ.94,030 కోట్లకు చేరిననప్పటికీ.. డిమాండ్ మాత్రం తగ్గింది. 2025లో భారత గోల్డ్ డిమాండ్ 700 టన్నుల నుంచి 800 టన్నుల మధ్యలో ఉంటుందని డబ్ల్యూజీసీ అంచనా వేసింది.

ఈ ఏడాది ప్రారంభం నుంచి బంగారం ధర 25 శాతం పెరిగింది. ప్రస్తుతం కాస్త దిగొచ్చిందికానీ.. ఒక దశలో 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.లక్ష కూడా దాటేసింది. ఈ పరిణామాలు కొనుగోలుపై ప్రభావం చూపింది. అయితే అక్షయ తృతీయ, పెళ్లిళ్ల సీజన్ కొనుగోళ్ల సెంటిమెంట్‌కు మద్దతు ఇస్తూనే ఉందని డబ్ల్యూజీసీ ఇండియా సీఈఓ సచిన్ జైన్ తెలిపారు. రికార్డు ధరల కారణంగా వినియోగదారులు చిన్నపాటి, తేలికైన ఆభరణాల వైపు మొగ్గుచూపుతున్నారు. కొందరేమో ధర తగ్గుతుందని వేచి చూస్తున్నారు. అయితే వివాహాల కారణంగా డిమాండ్ కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితి కారణంగా బంగారాన్ని సురక్షిత పెట్టుబడిగా భావిస్తున్నారు. దాంతో బంగారు కడ్డీలు, నాణేలకు డిమాండ్ కనిపిస్తోంది. అదే సమయంలో ఆభరణాల డిమాండ్ మొదటి త్రైమాసికంలో 25 శాతం తగ్గి, 71.4 టన్నులకు చేరింది. గత సంవత్సరం ఇదే సమయంలో 95.5 టన్నులుగా ఉంది.

కాగా.. అక్షయ తృతీయ రోజున (బుధవారం) దేశీయ ఆభరణాల విపణిలో రూ.16,000 కోట్ల వ్యాపారం జరిగే అవకాశం ఉందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (కెయిట్) అంచనా వేస్తోంది. పసిడి, వెండి ధరలు బాగా పెరిగినందున, తక్కువ పరిమాణంలో అయినా కొనుగోళ్లకు ప్రజలు ముందుకొస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. గతేడాది అక్షయ తృతీయ రోజున 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.73,500 ఉండగా.. ప్రస్తుతం రూ.లక్ష సమీపంలో ఉంది. వెండి కిలో ధర కూడా రూ.86,000 నుంచి ప్రస్తుతం రూ.99,800కు పెరిగింది.

### అక్షయ తృతీయ వ్యాపారం.. రూ.16,000 కోట్లు! కెయిట్ అంచనా

దిల్లీ: అక్షయ తృతీయ రోజున (బుధవారం) దేశీయ ఆభరణాల విపణిలో రూ.16,000 కోట్ల వ్యాపారం జరిగే అవకాశం ఉందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (కెయిట్) అంచనా వేస్తోంది. పసిడి, వెండి ధరలు బాగా పెరిగినందున, తక్కువ పరిమాణంలో అయినా కొనుగోళ్లకు ప్రజలు ముందుకొస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. ధరలు బాగా పెరగడం వల్ల ఈఏడాది వినియోగదారు గిరాకీపై ప్రభావం పడొచ్చ'ని ఆల్ ఇండియా జ్యువెలర్స్ అండ్ గోల్డ్‌స్మిత్ ఫెడరేషన్ అధ్యక్షుడు పంకజ్ అరోరా తెలిపారు.

# కవ్వింపుల వేళ.. పాక్ సైన్యానికి భారత్ వార్నింగ్

పహల్గాం ఉగ్రదాడి తర్వాత నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పాకిస్థాన్, భారత్‌కు చెందిన మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరళ్లు హాట్‌లైన్‌లో మాట్లాడుకున్నారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ పాక్ సైన్యం కాల్పులకు పాల్పడుతున్న విషయాన్ని ప్రస్తావించిన భారత్.. దాయాది దేశాన్ని హెచ్చరించినట్లు రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి.

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. దీంతో సరిహద్దు ప్రజలు అప్రమత్తమవుతున్నారు. ఇదే సమయంలో పాకిస్థాన్ కూడా భద్రతాపరంగా పలు చర్యలు తీసుకుంటోంది. తాజాగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని గిల్గిత్, స్కర్దు తదితర ప్రాంతాలకు విమాన సర్వీసులను పాకిస్థాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ రద్దు చేసింది.

# భారత సైన్యంపై పాక్ తప్పుడు ప్రచారం

పహల్గాం ఉగ్రదాడి తర్వాత నెట్టింట్లో విరివిగా తప్పుడు సమాచార వ్యాప్తి జరుగుతోంది. భారత్‌ను నేరుగా ఎదుర్కోలేని పాకిస్థాన్ ఈ చర్యకు పూనుకుంటోంది. చివరకు మన సైన్యం గురించి అసత్య వార్తలు ప్రచారం అవుతున్నాయి. అసలు విషయం చెప్పి, భారత్ వీటికి కౌంటర్ ఇచ్చింది.




ఉగ్రదాడి తర్వాత నార్తర్న్ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ సుచీంద్ర కుమార్‌ను పదవి నుంచి తొలగించారని, కస్టడీలోకి తీసుకున్నారని పాక్ అనుకూల సోషల్ మీడియాలో పలు పోస్టులు దర్శనమిచ్చాయి. భద్రతా వైఫల్యం కారణంగా ఆ చర్యలు తీసుకున్నారని వాటి సారాంశం. అవన్నీ నకిలీ వార్తలని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోకు చెందిన ఫ్యాక్ట్ చెకింగ్ విభాగం తేల్చిచెప్పింది. సుచీంద్ర కుమార్ గురించి పాక్ అనుకూల సోషల్ మీడియా ఖాతాలు తప్పుగా పేర్కొంటున్నాయని వెల్లడించింది. వాస్తవంగా ఏప్రిల్ 30న కుమార్ పదవీవిరమణ చేస్తున్నారు. ఆయన స్థానంలో లెఫ్టినెంట్ ప్రతీక్ శర్మ బాధ్యతలు చేపట్టనున్నారని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ వెల్లడించింది. అలాగే నియంత్రణ రేఖ సమీపంలో భారత్‌కు చెందిన రఫేల్ యుద్ధ విమానాన్ని పాక్ సైన్యం కూల్చివేసిందని ఓ వార్త చక్కర్లు కొట్టింది. అది తప్పుడు కథనం అని భారత్ తేల్చిచెప్పింది.



## ఆ నీళ్లు పాక్‌కు వెళ్తాయి.. మాకివ్వండి

### పంజాబ్‌ను అభ్యర్థించిన హరియాణా

పంజాబ్ వద్ద భాక్రా రిజర్వాయర్‌లో అదనంగా మిగిలిపోయిన తాగునీరు తమకు ఇవ్వాలని హరియాణా అభ్యర్థించింది. లేకపోతే.. ఆ నీరు పాకిస్థాన్‌కు వెళ్లడం మినహా ప్రయోజనం లేదని పేర్కొంది. భారత్ సింధూ జలాల ఒప్పందం నిలిపివేత నేపథ్యంలో హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ ప్రకటన విడుదల చేశారు. సింధూ జలాల ఒప్పందం పరిధిలోని అతిపెద్ద ఆనకట్టల్లో ఇది కూడా ఒకటి కావడం విశేషం.

"జూన్ నాటికి భాక్రా నంగల్ ఆనకట్టను ఖాళీ చేయడం అవసరం. అప్పుడే వర్షాకాలంలో నదీ జలాలను నిల్వ చేసుకోవచ్చు. రిజర్వాయర్‌లో అప్పుడు నీరు లేకపోతే.. అదనపు జలాలు హరి-కె-పట్టాన్ నుంచి పాకిస్థాన్‌లోకి వెళ్లిపోతాయి. అది అటు పంజాబ్.. ఇటు హరియాణాకు ఉపయోగపడదు.

దిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్లు నీటి విడుదలకు పంజాబ్ ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరాలు లేవు. ప్రస్తుతం అక్కడ ఆప్ ప్రభుత్వం లేదు. అలాంటి సమయంలో దిల్లీ ప్రజలను శిక్షించేలా అలాంటి ప్రకటనలు ఎందుకు చేస్తున్నారు. అసలు హరియాణాకు రావాల్సిన వాటా జలాలే అందుబాటులోకి రాలేదు. గత నెల భాక్రా బేస్ మేనేజ్‌మెంట్ బోర్డ్ విడుదల చేసిన నీటిలో పంజాబ్, రాజస్థాన్, దిల్లీకి పోగా హరియాణాకు మిగిలింది కేవలం 6,800 క్యూసెక్కులు మాత్రమే. ఇక న్యాయంగా హరియాణాకు రావాల్సిన వాటా ఇచ్చినా.. అది భాక్రా ప్రాజెక్టులో నిల్వ ఉండే నీటిలో 0.0001 శాతానికి సమానం" అని నాయబ్ సింగ్ సైనీ పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం చీనాబ్, జీలమ్ సహా ఇతర నదుల నీటిని ఉత్తరాది రాష్ట్రాల వ్యవసాయ అవసరాలు తీర్చేందుకు మళ్లించాలని సైనీ కోరారు. ప్రస్తుతం భాక్రానంగల్ ప్రాజెక్టు పంజాబ్, హరియాణా, రాజస్థాన్ నీటి అవసరాలను తీరుస్తోంది.